క్లుప్తంగా

అగ్రి ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ చేయూత



అవురిపూడి(మొవ్వ): మొవ్వ మండలం అవురిపూడిలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన బాధిత కుటుంబానికి మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మంగళవారం గృహోపకరణాలను పంపిణీ చేశారు. బాధితుడు నాగులపాటి వీరాస్వామి కుటుంబానికి ఈ సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న తహసీల్దార్ కే మస్తాన్ చేతుల మీదుగా గృహోపకరణాలతో పాటు రూ.5 వేలను అందజేశారు. కృష్ణా జిల్లా శాఖ కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమంలో డీటీ కే శ్రీనివాసరావు, జొన్నలగడ్డ హనుమకుమార్, కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోనేరు మంజునాథ్, తులసీదాస్, శివరామయ్య, కామేశ్వరరావు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో అక్రమంగా మట్టి తవ్వకాలు

కొమరవోలు(పామర్రు): మండలంలోని కొమరవోలు గ్రామ శివారు గాంధీ ఆశ్రమంలో మంగళవారం ఉదయం మట్టిని కొందరు అక్రమంగా తరలించారు. ఏ విధమైన అనుమతులు లేకుండా మట్టి పొక్లెయినర్ సాయంతో తవ్వి ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలను తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్‌లో దసరా వేడుకలు



గుడివాడరూరల్: గుడివాడ డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ స్కూల్లో కన్నుల పండువగా దసరా వేడుకలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ మంగళవారం తెలిపారు. కనకదుర్గాదేవిని శాస్త్రోక్తంగా అష్టోత్తరనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియచేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలుత విద్యార్థులు వివిధ రకాల అమ్మవారి రూపాల్లో అలరించారు. ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి పాల్గొన్నారు.

బాలయోగి సేవలు చిరస్మరణీయం

కైకలూరు: దేశ రాజకీయాల్లో తెలుగువారి సత్తా చాటిన లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. కైకలూరు తాలూకా సెంటర్‌లో బాలయోగి జయంతి సందర్భంగా మంగళవారం విగ్రహానికి నివాళులర్పించారు. టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ విఠల్‌రావు పాల్గొన్నారు. శ్యామలాంబ అమ్మవారి దసరా మహోత్సవాల పోస్టర్‌ను ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఎమ్మెల్యే కామినేని ఆవిష్కరించారు.

స్వచ్ఛతా హి సేవలో ఫార్మసీ విద్యార్థులు



గుడ్లవల్లేరు: చిత్రం గ్రామంలో జాతీయ సేవా పథకం కింద గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కళాశాల విద్యార్థులు మంగళవారం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవ పేరిట గ్రామంలోని ప్రధాన వీధులను విద్యార్థులు శుభ్రపరిచారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని స్థానికులకు విశదీకరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, సర్పంచ్ గళ్లా అక్కయ్య నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొదటి రోజు దరఖాస్తులు నిల్

కైకలూరు: నూతన మద్యం విధానంలో లైసెన్స్‌ల జారీకి కసరత్తు ప్రారంభమైంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నుంచి కైకలూరు నియోజకవర్గానికి నూతన సీఐ, ఎస్‌ఐలు బాధ్యతలు చేపట్టారు. నూతన సీఐ ఎస్‌కే.రమేష్ మాట్లాడుతూ కైకలూరు మండలంలో 8, మండవల్లి మండలంలో 3, కలిదిండి మండలంలో 6, ముదినేపల్లి మండలంలో 5 మద్యం దుకాణాలకు లైసెన్సులు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. మొదటిరోజు ఎలాంటి దరఖాస్తులు రాలేదని తెలిపారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

ముదినేపల్లి రూరల్: గత విద్యాసంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రూ.30 వేలు విలువైన నగదు పురస్కారాలు అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన మాగంటి బాపినీడు, సువర్చల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ నగదు బహుమతులు అందజేశారు. పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన పి.హేమరేవంత్‌కు రూ.10 వేలు, ద్వితీయ స్థానం సాధించిన కలీ మున్నీసాకు రూ.5 వేలు మరో 10 మంది విద్యార్థులకు రూ.15 వేల నగదు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం విజయకుమార్ పాల్గొన్నారు.

పండగలా వచ్చారు

స్వాతంత్ర్యోద్యమ సమయంలో కౌతవరం వాసులకు ఉద్యమ ఊపిరులు ఊదేందుకు మహాత్మాగాంధీ ఆ గ్రామానికి పండగలా వచ్చారు. అందుకు సంకేతంగా ఆయన ఇక్కడ నడయాడిన తీపి గుర్తులను ఆ గ్రామస్తులు పదిల పరచుకున్నారు. గ్రామంలోని చేవెంద్ర రోడ్డు ఆరంభంలో నిర్మించిన గాంధీజీ, కస్తూరీబా మండపమే అందుకు నిదర్శనం.

- కౌతవరంలో నడయాడిన మహాత్మాగాంధీ
- నేడు గాంధీ జయంతి



కౌతవరంలో గాంధీ, కస్తూరాబా మందిరం

గుడ్లవల్లేరు: స్వాతంత్ర్యోద్యమం సమయంలో మహాత్మాగాంధీ కౌతవరం వచ్చారు. ఉద్యమాన్ని నిర్వహించేందుకు స్త్రీలు తమ నగలు, పురుషులు డబ్బు మహాత్ముని చేతికి అందజేసి తమ దేశ భక్తిని చాటుకున్నారు. గాంధీ వచ్చి వెళ్లినట్లుగా గాంధీజీ, ఆయన సతీమణి కస్తూరీబాకు దాతలు బొబ్బా ఈశ్వరరావు, బొబ్బా నాగేశ్వరరావు స్థానికంగా మందిరాన్ని కూడా నిర్మించారు. అప్పట్లో గ్రామస్తులు గాంధీజీ పిలుపును అందుకుని స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని ఎన్నో త్యాగాలు చేశారు. కానూరి చిన వెంకటదానయ్య, బొబ్బా వీర భద్రయ్య, తాళ్లూరి శ్రీరాములు వంటివారు స్వాతంత్ర్య సమరంలో లాఠీ దెబ్బలు కూడా తిన్నారు. జైళ్లకు వెళ్లారు విదేశీ వస్త్ర బహిష్కరణ చేశారని స్థానికులు కొందరు తెలిపారు.

కౌతవరంలో కళకళలాడిన చేనేత రంగం

సహాయ నిరాకరణ ఉద్యమానికి గాంధీ పిలుపు ఇచ్చిన రోజులవి. 1921లో విజయవాడ మహాసభకు హాజరైన బాపూజీకి కౌతవరం గ్రామస్తులు ప్రత్యేకంగా దుస్తులను నేసి సమర్పించారు. 1930 వరకూ కో-ఆపరేటివ్ బేసిస్ మీద ఖద్దరు ఉత్పత్తి సంఘం ఏర్పడి పని చేసింది. ఈ బేసిస్ కింద గ్రామంలో ఎనిమిది మగ్గాలు, 400 రాట్నాల వరకూ పని చేసేవి. అల్లాడివారి తోటలో 40 కుటుంబాల వారు ప్రత్యేకంగా ఖద్దరు ఉత్పత్తులను తయారు చేసేవారు. అంతేగాక 1922లో తాళ్లూరి శ్రీరాములు రూ.6వేల తన సొంత మూల ధనాన్ని వినియోగించి తన సొంత స్థలంలో ఖద్దరు ఉత్పత్తి రంగాన్ని చేపట్టారని స్థానికులు తెలిపారు.

ఉద్యమ స్ఫూర్తి గాంధీజీ



మా గ్రామస్తులకు స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పంచేందుకు వచ్చిన బాపూజీకి గ్రామస్తులంతా సంయుక్తంగా ఏటా ఆయన జయంతిని పండగలా జరుపుకుంటారు. దాతల సహకారంతో ఆయనకు పార్కు కూడా ఏర్పడింది.

– పడమటి సుజాత, మాజీ సర్పంచ్

లాఠీ దెబ్బలు తిన్నారు



మా ప్రాంతంలో చాలామంది గాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నారు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకించి జైళ్లకు కూడా వెళ్లారు. ఆయన స్ఫూర్తితో గ్రామంలో చేనేత వస్త్రాల్ని కూడా నేశారు.

– కానూరి రాజేంద్రప్రసాద్, యోగా గురువు

రెండు సార్లు వచ్చారు



స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ రెండుసార్లు కౌతవరం వచ్చారు. ఒకసారి 1925లో వచ్చి భారీ సమావేశాన్ని గ్రామస్తులతో నిర్వహించారు. ఆ తర్వాత ఒకసారి పాదయాత్ర చేస్తూ వచ్చారు. ఆయన ఉద్యమానికి గ్రామస్తులు స్పందించి చందాలు కూడా భారీగా సమర్పించారు.

– బొబ్బా ప్రభాకరరావు, గ్రామస్తుడు

ఉత్సాహంగా క్రీడా పోటీలు



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు గ్రామంలోని సన్‌ఫ్లవర్ స్కూల్లో మంగళవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పామర్రు నియోజకవర్గ క్రీడా పోటీలు ఉత్సాహ వాతావరణంలో జరిగాయి. పామర్రు నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జవహర్, మొవ్వ స్పోర్ట్స్ ఇన్‌చార్జి చందు పర్యవేక్షణలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల్లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని జవహర్ తెలిపారు. ఈ పోటీలకు స్కూల్ ప్రిన్స్‌పాల్ జోసఫ్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు సహకరించారు.

జిల్లా స్థాయి షటిల్ పోటీలకు అసీస్సీ విద్యార్థులు

పామర్రు: స్కూల్ గేమ్సు ఫెడరేషన్ వారి జిల్లా స్థాయి షటిల్ పోటీలకు తమ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు అసీస్సీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సబాస్టియన్ పేర్కొన్నారు. స్థానిక అసీస్సీ హైస్కూల్లో విజేతలైన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోసూరు సన్‌ఫ్లవర్ స్కూల్లో నిర్వహించిన షటిల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో ఎస్.వెంకట్ తిరుమల, అండర్-14 బాలుర విభాగంలో ఎన్.మహేష్, కె.రుద్వేష్ విజయం సాధించారని పేర్కొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సబాస్టియన్

ముగిసిన క్రీడా పోటీలు

ముదినేపల్లి రూరల్: స్థానిక జెడ్పీ హైస్కూల్, వికాస్ కళాశాల్లో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి విద్యార్థుల క్రీడాపోటీలు మంగళవారంతో ముగిశాయి. నియోజకవర్గ స్థాయి పోటీలకు ఈ విద్యార్థులను ఎంపిక చేశామని, క్రీడల ఇన్‌చార్జి కోడే రోజా తెలిపారు. ఈ విద్యార్థులు కైకలూరులో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.



ముదినేపల్లిలో నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వృద్ధులను ఆదరించకుంటే జైలే



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి

కైకలూరు: వృద్ధులను వారసులు ఆదరించకుంటే చట్టపరంగా శిక్షించే అవకాశం ఉందని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎన్‌వీ.లక్ష్మి తెలిపారు. కైకలూరు కోర్టు వద్ద మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో వృద్ధుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమ చట్టం-2007 ప్రకారం పలు హక్కులు వృద్ధులకు సంక్రమిస్తాయన్నారు. వృద్ధులు నిరాదరణకు గురైతే బాధ్యులకు మూడు నెలల జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పానల్ అడ్వొకేట్స్ పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, బి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రక్త దాతలకు సన్మానం



రక్తదాతలను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పామర్రు(తోట్లవల్లూరు): స్వచ్ఛంద రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని తోట్లవల్లూరు మండలం యాకమూరులోని సుధీర్ టింబర్ డీపోలోని కాన్ఫరెన్స్ హాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు వారి ఆధ్వర్యంలో రక్త దాతల అభినందన కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి, లయన్స్ జిల్లా క్యాబినెట్ డిప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు మాట్లాడుతూ రక్త దాన ప్రచారంపై కొందరిలో ఉన్న భయాన్ని, అపోహలను తొలగించడానికి స్వచ్ఛంద రక్త దాన దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆరోగ్యవంతులైన యువత రక్తం ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ప్రెసిడెంట్ నేరెళ్ల తేజ మాట్లాడుతూ జిల్లా లయన్స్ సంస్థ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తదాన కార్యక్రమం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందన్నారు. అనంతరం స్వచ్ఛందంగా పలుమార్లు రక్త దానం చేసిన, ప్రోత్సహించిన కె.శృతి, పామర్తి వెంకట్, వెంకట తరుణ్‌కుమార్, విరిగినేటి నిఖిల్, సంజయ్‌ను లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, లయన్స్ క్లబ్ కార్యదర్శి వెల్లి రాంబాబు, ట్రెజరర్ దినవహి ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, పూర కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రాము, లయన్స్‌ప్రగతి సభ్యులు

గుడివాడరూరల్: పరిశుభ్రత పచ్చదనంతో కూడిన క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడ రూపకల్పనలో ప్రజలను చైతన్యపరిచేలా స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకొచ్చి పని చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. స్థానిక డాక్టర్ గురురాజు హోమియోపతి కళాశాల్లో వరల్డ్ వాలంటరీ బ్లడ్ డోనేషన్ డే సందర్భంగా గుడివాడ లయన్స్‌క్లబ్ ప్రగతి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం హోమియో విద్యార్థులతో కలసి కళాశాల ప్రాంగణంలో పూల, పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణను కూడా స్వచ్ఛంద సంస్థలు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం వల్ల కాలుష్య నివారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు శ్రీకాంత్, జగన్‌మోహన్‌రావు, ఉమా పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి



భూసార పరీక్ష ఫలితాల పత్రాలు అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

ముదినేపల్లి రూరల్: భూసారాన్ని పరిరక్షించేందుకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి, వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ రైతులకు సూచించారు. మండలంలోని చిగురుకోట, పెదకామనపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వినియోగంతో భూసారం క్రమేపీ తగ్గిపోతుందన్నారు. పశువైద్యాధికారి రామకృష్ణ మాట్లాడుతూ ఉచితంగా ఎద పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నరసింహరావు, ప్రకృతి వ్యవసాయ విభాగం సీఆర్పీ గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసేలా పని చేయాలి

గుడివాడరూరల్: ప్రజలకు మేలు చేసేలా అధికారులందరూ పని చేసి ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ ఎక్సైజ్‌శాఖ సీఐగా బాధ్యతలు చేపట్టిన పి.వెంకటరమణ, గుడివాడ, నందివాడ ఎక్సైజ్ ఎస్‌ఐలు హేమసుష్మిత, ఆశాలత మంగళవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే స్వగృహంలో కలసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సీఐ, ఎస్‌ఐలకు సూచించారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొండలమ్మ ప్రాంగణంలో కొత్త శోభ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు తల్లి సన్నిధి కొత్త శోభను సంతరించుకుంది. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం ఎదుట ఎంఎన్‌కే రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు జరిగే ఎత్తులో భక్తుల సౌకర్యార్థం భారీ పందిళ్లను వేయించారు. అలాగే ఆలయ ప్రాంగణంతో పాటు అనివేటి మండప ఆవరణలో వర్షం, ఎండ బారిన పడకుండా ఉండే టార్పాలిన్ పందిళ్లకు భక్తుల సౌకర్యార్థం డెకరేషన్ చేయటంతో ఆలయమంతా సుందరంగా మారింది.

దరఖాస్తుల ఆహ్వానం

పామర్రు: మండలంలోని రెండు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులను కోరుతున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ వీ భానుశ్రీ మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ పామర్రు గ్రామంలోని పామర్రు-5 కంచర్లవానిపురంలో ఎస్సీ అభ్యర్థి, పామర్రు-16 సెంటర్ ఎలమర్రు రోడ్డులో బీసీ(ఎ) అభ్యర్థుల నుంచి అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులను కోరుతున్నామని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోనే ఉంటూ వివాహితులైన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పాస్ ఉండాలి, 01-07-2024 నాటికి 21 ఏళ్ల నిండి 35 ఏళ్ల వయస్సు లోపు ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు లేటెస్టు కులధ్రువీకరణ పత్రాలను అందజేయాలని తెలిపారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

చినపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని చినపారుపూడిలో ఉన్న అంగన్‌వాడీ సహాయకురాల పోస్టు ఖాళీగా ఉండటంతో బీసీ-డి మహిళలను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెదపారుపూడి సెక్టర్ సూపర్‌వైజర్ అరుణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని మర్రివాడ-1 అంగనవాడీ కార్యకర్త పోస్టు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు పామర్రు ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీఓ భానుశ్రీ తెలిపారు. ఈ పోస్టును ఎస్సీలకు కేటాయించారని, వివాహితులైన మహిళా అభ్యర్థినులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

మూఢ నమ్మకాలను ప్రచారం చేసేవారిపై చర్యలు

గుడివాడరూరల్: మూఢ నమ్మకాలను ప్రచారం చేసే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. స్థానిక హేతువాద సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలో కూడా మూఢ నమ్మకాలను ప్రచారం చేసే వారిని అదుపుచేసి, వారిని జైళ్లకు తరలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఒక పక్క రోజురోజుకీ టెక్నాలజీ మారుతుంటే.. మరో పక్క మూఢనమ్మకాల ప్రచారం విస్తృతం జరుగుతోందన్నారు. దీన్ని వెంటనే అరికట్టాలని కోరారు.

సమస్యల పరిష్కార దిశగా పాలన

గుడ్లవల్లేరు: ప్రజా సమస్యల పరిష్కార దిశగా పరిపాలన కొనసాగిస్తున్నామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మంగళవారం డోకిపర్రు, పెంజెంద్ర గ్రామ సచివాలయాల్లో ఇది మంచి ప్రభుత్వం పేరిట ఏర్పాటు చేసిన గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ లోపరాజు, హౌసింగ్ డీఈ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

పమిడిముక్కల: ఈ పంట నమోదు చేసుకున్న రైతులు ఈకేవైసీ చేసుకునేందుకు ఈ నెల 3వ తేదీ వరకు గడువు పొడిగించారని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. ఈకేవైసీ పూర్తి కాని రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. మండలంలోని మంటాడ, గురజాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ రైతులతో కలిసి పొలాలను సందర్శించారు. పశువైద్యాధికారి రాంనరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రత్యేక పూజలు

పామర్రు: ఉంద్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి విశేషంగా పంచామృతాలతో నవరసాలతో అభిషేకాలను చేశారు.

నష్టపరిహారం జమ

పెదపారుపూడి: వరద బాధితులకు నష్టపరిహారాన్ని వారి ఖాతాలో జమచేసినట్లు తహసీల్దార్ రంగారావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని మోపర్రు, వింజరంపాడు, దోసపాడు, నాగాపురం గ్రామంలో 865 మంది ఇళ్లు నీట మునగటంతో ఒక్కొక్కరికి రూ.10 వేలు బాధితుల బ్యాంక్ ఖాతాలో జమ చేశామన్నారు.

వృద్ధుల సంరక్షణ బాధ్యతగా భావించాలి

కైకలూరు: వృద్ధుల సంరక్షణను బాధ్యతగా భావించాలని కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) సూపరింటెండెంటు ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా తామరకొల్లు మదర్‌థెరిస్సా ఆశ్రమంలో వృద్ధులకు పలు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు రఫాయేల్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

మండవల్లి: మండలంలోని కాకతీయనగర్‌లో వరద బాధితులకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎస్ వీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

పామర్రు: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని కొండిపర్రు గ్రామ టీడీపీ అధ్యక్షుడు నూకారపు వీరాంజనేయులు రాజా అన్నారు. కొండిపర్రు గ్రామంలో మంగళవారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. నాయకులు విజయ్‌కుమార్, సత్యనారాయణ, చిరంజీవి, సువర్ణరాజు ముదునూరి, వీఆర్వో బేబి సరోజని పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా లోకరాజు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బి.లోకరాజు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. గుడివాడ నుంచి ఆయన గుడ్లవల్లేరుకు బదిలీపై వచ్చారు. అలాగే కౌతవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ లావణ్య బదిలీపై ఏలూరు వెళ్లారు. ముదినేపల్లి నుంచి బదిలీపై వచ్చిన ఎస్.మధుబాబు కౌతవరం సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు మంగళవారం పంపిణీ చేశారు. ఇటీవలే సెమిస్టర్-1 పరీక్షలు పూర్తికాగా దసరా సెలవులు తరువాత సెమిస్టర్-2 పాఠ్యాంశాలు బోధించాల్సి ఉంది. ఈ పాఠ్యపుస్తకాలను స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో ప్రధానోపాధ్యాయులకు అందజేయగా వీటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. పెయ్యేరు పాఠశాలలో ఉపాధ్యాయులు సీహెచ్ చక్రధర్, బేతాల రాజేంద్రప్రసాద్, పాఠశాల చైర్మన్ మున్నీసా పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి అభిషేకాలు జరిగాయి.

అసంఘటిత కార్మికులకు అండగా నిలవాలి

కైకలూరు: ఆర్థికంగా దెబ్బతిన్న అసంఘటిత కార్మికులకు ప్రభుత్వాలు అండగా నిలవాలని బీఎంఎస్ రాష్ట్ర నాయకులు యానాల బసవయ్య కోరారు. స్థానిక బైపాస్ రోడ్ వద్ద వేంకటేశ్వర తాపీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగిరెడ్డి కొండయ్య ఆధ్వర్యంలో తాపీ, పెయింటింగ్ వర్కర్లతో సమావేశం మంగళవారం జరిగింది. యూనియన్ అధ్యక్షుడు అంకెం త్రిమూర్తులు పాల్గొన్నారు.

నేడు యోగా శిక్షణ ప్రారంభం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక లయన్స్ సేవా భవన్‌లో యోగా శిక్షణ కార్యక్రమం జిల్లా లయన్స్ గవర్నర్ శేషగిరి చేతుల మీదుగా చేపట్టనున్నట్లు ఆర్గనైజర్ వై.పి.సి.ప్రసాద్ తెలిపారు. శిక్షణను కె.డి.ఎస్.వి.శ్రీనివాస్ ఇవ్వనున్నారని పేర్కొన్నారు.